

# పయనం

వి.ఆర్. రాసాని

“ఏమ్మామా! యీ దినమెట్టయినా సరే. నక్కనేసక రావాల్సిందే. గేరిలో గంగల జరగాల్సిందే.” ఉదయాన దుడ్డుకర్రను, ఒక సలాకీని చేతబట్టుకొని, పదిరోజుల క్రితం ఊట్లో నొంకలో వేసుకున్న గుడారాలను చూసుకొంటూ వచ్చి పలుకరించాడు అజ్జప్ప.

తన నాటు తుపాకీలో సీసపు పప్పుల్ని నల్లమందు వేసి, ఒక ఇనుపకడ్డీతో కూరుతూ గుడారం ముందర కూర్చొని ఉన్న నాగప్ప తల పైకెత్తి చూశాడు.

మోకాళ్ల దాకా పెట్టిన గోచీ, అది జారిపోకుండా నడుము బిగించి ఉన్న వెడల్పాటి ఎర్రరంగు బెల్టు, చేతి రెట్టకు ఒక తాయత్తు, మెడలో పులిగోరుతాడు, ఒక చేతిపైన తేలు ఆకారపు పచ్చబొట్టు, ముడిపెట్టి ఉన్న పొడవాటి జుట్టు, దానికి ఎర్రటి తలగుడ్డ... కండలు తిరిగిన శరీరంతో బలిష్టంగా కనిపిస్తున్నాడు అజ్జప్ప.

అదే ఆకారంలో ఉన్న నాగప్ప సీసపు మందు కూరడం పూర్తిచేసి, “అదే నేనూ యోచ్చన జేస్తావుండా. ఆ మద్దెన యిక్కడ వాన చినుకులు పడబట్టి ఈ వంకలో సన్నగానైనా సరే, నీళ్లు పారతా వుండాయి. వాటిని నమ్ముకొని యిక్కడ మన గేరి గుడారాలేసి పది రోజులవుతున్నా... ఒక నక్కనూ గొట్లామరి... అసలి ప్పుడు అడవుల్లో నక్కలుండాయా అనేది గూడా అను మానమే,” అని పైకి లేచి తుపాకీని చేతబట్టుకొని అడవి లోకి దారి తీశాడు. అతన్ననుసరించాడు అజ్జప్ప.

అప్పటికే గేరిలో మగవాళ్లు అడవి పైనబడి పోయారు. చిన్నచిన్న తీంట్ర పొదలు, ఉల్లింజ, పరిక, రేగు, గేదార, చిగర, బండార, సీతాఫలం, కలించెట్లు, చీకి, బలస, అడవి గుమ్మడి, మంగ వంటి కంపచెట్లు... ఇంకా రకరకాల చెట్లతో, కాశిగంట్లతో కనిపిస్తున్న అడవిని చూస్తూ నడుస్తున్నారు వాళ్లు.

“ఏమ్మామా... మీవోడు పెండ్లాన్ని తీసుకోని తిర పతికి పోయినాడు గదా. గేరికొచ్చి శ్యానా యేండ్లయి పాయనే. యెట్టుండాడు?”

దారిలో ఉన్న కంపల్ని, రాళ్లని చూసి తప్పించు కుంటూ అడుగులేస్తూ అడిగాడు అజ్జప్ప.

“వోన్ని జూసి మూడేండ్లయిపాయ. యెట్టుండో ఏమో,” బాధగా అన్నాడు నాగప్ప.

“మనకు యిండ్లు లేకపాయ. అడివి పైనబడి బతికేవోళ్లం. ఈడ ఏముండాది. దినదినగండం నూరేళ్లా యుష్షు అట్ల టవునుకన్నా బొయ్యి బతకదామని బొయి నాడు మీ నరసప్ప. అక్కడ పూసలు, దారాలు, గవ్వలు అమ్మతా వుండాడంట. వరుంబడి బాగానే వుంటాదిలే.”

“ఏం వరుంబడో ఏమొ... టవున్లో యాపారంజేసే యిగితి తెలియాల గదా,” చిగరచెట్టు తోపులా పెరిగి ఉన్న చిగరమాకల దడిలోకి దిగబడి ఒక్కక్షణం ఆగాడు నాగప్ప.

“ఏమి, నిల్చిపోతివి. ఈ దడి కవతలుండే చింత లొంక కల్లాబోతే నక్క దొరక్కపోయినా కుందేండ్లయినా దొరకతాయి గదా,” అన్నాడు అజ్జప్ప.

“అదిగాదురా, మనం గుడారాలేసిండే ఊట్లో నొంకలో నీళ్లు పారడం సన్నగిల్లింది. ఇంక రెండు మూడురోజుల్లో వాన బడకపోతే వొంక ఎండిపోతుంది. అంతలోపల మనం నీళ్లుండే యింగొగతావు జూసు కోవాల. అందుకని మనం చింతలొంక కల్లా గాకుండా ఎలుగ్గోడ్డోని బాయికల్లా పోదాం. నీళ్లజాడ కని పెడదాం,” సాలోచనగా అన్నాడు నాగప్ప.

"ఆపక్క వంకలోగదా ఎలుగ్గొడ్డోని బాయుండేది. ఆడ ఎప్పుడూ నీళ్లుంటా వుండే. మూడేండ్లకు ముందు ఆడనే గదా రెండు నెలలు కాలం గడిపినాము," నాగప్ప ఆంతర్యాన్ని అర్థం చేసుకుని మరీ చెప్పాడు అజ్జప్ప.

వాళ్ల నడక ఎలుగ్గొడ్డోని బాయివైపు మళ్లింది. దారిలో వాళ్ల చూపులు పుట్ట పుట్టను, చెట్టు చెట్టును వెదుకుతున్నాయి. ఏ చెట్లో ఏముంటుందో, ఏ పొదలో ఏది జీవిస్తుందో వాళ్లకు బాగా తెలుసు.

వాళ్లు నక్కలోళ్లు. అడవిలో ఎక్కడ నీళ్లుంటే అక్కడ గుడారాలేసుకొని, అడవుల్లో జంతువుల్ని వేటాడి తింటూ, ఆ ప్రాంతంలో ఉన్న పల్లెల్లో పిన్నీసులు, తల పిన్నులు, పూసల దండలు అమ్మి, ఆ డబ్బుతో కాసిన్ని నూకలు తెచ్చుకుంటూ బతికే సంచార జీవనులు. ఈ మధ్యనే దాదాపు పది కుటుంబాల జనం ఊట్లోనొంక గుడారాలేసుకున్నారు. ఆ గేరిలో వున్న ఆ ఇద్దరూ ఆరోజు గ్రాసాన్ని వెదుక్కుంటూ వెళుతున్నారు.

ముందు అరవై ఏళ్ల నాగప్ప, వెనక నలభై ఏళ్ల అజ్జప్ప. ఇద్దరూ నడుచుకుంటూ... ఎర్రజాల్ల దారిలో అడుగుపెట్టారు. అక్కడ దారి పక్కన బీరచెట్ల పొద... దానికవతల చిళ్ల చెట్లు, చంద్ర చెట్లు... వాటి కింద మూరడెత్తు పెరిగిన చెట్ల పైన పడింది అజ్జప్ప దృష్టి.

"మామా... వొగ్గెడి వుండు," అని ఆ చెట్ల దగ్గరకు నడిచి, వంగి చెట్లను పరిశీలించి, "ఇవి నిమ్మటాయి చెట్లు. వీటికి నేల్లో ఎర్రగడ్డలంతంతవి తెల్లంగా నిమ్మటాయి గడ్డలుంటాయి. వాట్ని తవ్వుకుంటే గేరిలో పిల్లోళ్ల నోటికి కమ్మగుంటాయి," అంటూ అక్కడ కూర్చున్నాడు.

"అవున్రో... నిమ్మటాయిల రుచే రుచి," నోరు చప్పరిస్తూ వచ్చి తుపాకీ కింద పెట్టి కూర్చున్నాడు నాగప్ప. అజ్జప్ప నేర్పుగా చేతిలో వున్న సలాకీతో గడ్డల్ని తవ్వాడు. వాటి ఆకుల్ని తొలగించి శుభ్రం చేస్తే దాదాపు కేజీ గడ్డలొచ్చాయి. వాటిని తలగుడ్డలో వేసి మూట గట్టుకొని తిరిగి నడక ప్రారంభించారు. మరికొంత సేపటికి మల్లబ్బాయి కాడున్న ఒంటరి మామిడిచెట్టు కాడికొచ్చారు. ఆ మాను... ఎన్నో ఏళ్ల కిందట అక్కడ పెరిగిన ఏకైక మామిడి మాను. అన్ని చెట్ల కంటే ఎత్తుగా పెరిగి మేటిగా కనిపిస్తోంది.

ఆ చెట్టు కిందనే నాగప్ప ఒక రాతిపైన కూర్చొని ఎండకు కాస్త అలుపు తీర్చుకున్నాడు. ఆ చెట్టును చూసినప్పటినుంచీ అతని పుర్రెలో ఏదో జ్ఞాపకం తొలుస్తూనే వుంది.

'ఒగప్పుడు, అడివి మొగదలవున్న పల్లెల్లో గొర్రెల మందలు, పశువులు దండిగా వుండె. కంసలోని కుంట కవతలున్న కురవపల్లెలో అయితే ఇంటికి యిన్నూరు గొర్రెలుండె. పొలాల కాలంలో గొర్రెలు మేసే బీళ్లు లేక కురవోళ్లు కంబళ్లెత్తుకొని తమ గొర్రెల్ని ఈ అడవి మొగదల్నే మంద తోల్తా వుండ్రి. వో యిరవైమందికి పైగానే గొర్రెల యజమానులు మంద కాస్తా వుండ్రి,' గతాన్ని తవ్వుకోసాగాడతను. ఆవేళ ఎప్పుడో అక్కడ జరిగిన సంఘటన అతని స్మృతి ఫలకం మీద బొమ్మ కట్టింది.

"ఏమ్మామా... యీడ నిల్చిపోతివి..." అడవిని చూస్తూ పలకరించాడు అజ్జప్ప.

"వొరే అజ్జా... ఇక్కడుండే బీట్లో ఒక నెలలోనే నాలుగు నక్కల్ని, వొగ తోడేలును, యింకో కొర్నం పోతును కొట్నానురా. నా జీవితంలో అదొక మరపురాని సంగతి," ఉత్సాహంగా చెబుతూ పైకి లేచి ముందుకు నడిచాడు నాగప్ప.

"కల్లూరుకవతలుండే రామన్నగారి కురవపల్లె కురవోళ్లు, గొల్లోళ్లు ఈ బీట్లో వొగతూరి మంద తోలిండ్రి. అప్పటికి నువ్వు యెసుగాయవి. మనం ఆ పక్కబోడ గుట్ట కవతల గుడారాలేసుకొని గేరి నిలిపింటిమి. ఆ గొర్రెల మందకు నక్కల బాధ, తోడేళ్ల పోరు ఎక్కువైపో యిండె," చెబుతూనే ఎలుగ్గొడ్డోని బాయివైపు నడిచాడతను.

"అవును మామా, యీ పక్క ఎర్రజాల్లలో అవి ఎక్కువగానే వుండాయిలే," ఎర్రజాల్లలో ఏ నక్కయినా కనిపించకపోతుందాన్న ఆశతో ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తూ అన్నాడు అజ్జప్ప.

దూరంగా పక్షుల అరుపులు వినిపిస్తున్నాయి. ఒక్కక్షణం ఆ అరుపుల్ని విని తిరిగి చెప్పసాగాడు నాగప్ప.

"వొగ దినం మందగౌడు నా దెగ్గిరికొచ్చి, 'ఓ నక్కలాయనా... మా పిల్లోనికొగనికి నచ్చు పాండురోగం... నక్క తునకలు తింటే ఆ నచ్చు పోతుందని చెప్పినారు. ఆపైన శక్తి వస్తుందని చెప్పినారు. నక్క మాంసం తెచ్చిపెట్టు. నీకు దుడ్డిస్తా,' అన్నాడు. ఆయనకు నక్క మాంస మిచ్చినా. ఇంగొక దినం వచ్చి నక్కలు, తోడేళ్లు గొర్రెల్ని ఎత్తకపోతా వుండాయి. అవి సాలక కొర్నంపోతొకటి మరి గుండాది. వాట్ని సంపు. నక్కకు పది, తోడేళ్లకు ఇరవై లెక్కన యిప్పిస్తానన్నాడు."

"అప్పుడు నువ్వు వొప్పుకుంటివా మామా," ఉత్సాహంగా అడిగాడు అజ్జప్ప.

"అదే గదరా సెప్తాండ," కాస్త విసుగ్గా అన్నాడు నాగప్ప.

"సరే, చెప్పు చెప్పు."

"వొగ ఆవును పట్టుకొచ్చి యిద్దో, ఆ వొంటి మామిడిచెట్టు కింద కట్టేయిస్తి. ఒక పెద్ద మాంసపు ముక్కను తెప్పించి, దాని ముడ్డికి అతికించి పెట్టి, దూరంగా ఆ పక్కనుండే గుంటిపైన కూసోని తుపాకెత్తు కోనుంటి. ఎక్కడగానీ మనిషి అలికిడే లే. ఆ తునక వాసన బట్టుకోని ఆ ఎర్రజాల్లలో నుంచీ వొగ పెద్ద తోడేలు అట్లా ఇట్లా చూసుకుంటూ యెలబారె. నేను ఊపిరి బిగబట్టి సూస్తానే వుంటి. అది దెగ్గిరికి రానే వచ్చే... అది ఇంకా దెగ్గిరికి రాంగానే తుపాకి గుర్రం నొక్కితి. అంతే గ్యాంగ్ అంటూ వొగ అరుపు అరిసి అది కిందపడి సచ్చె. ఆ దెబ్బకు ఆవు పగ్గం తెంపుకోని పరి గెత్తె. దాన్ని సంపిన వారానికి మాంసం ముక్కల్లో నల్ల మందు గుండ్లు బెట్టి కొర్నంపోతును, నక్కల్ను సంపితి."

చెప్పడం ఆపి ఎలుగొగ్డోని బాయి దగ్గరుండే ఏట్లోకి దిగసాగాడు నాగప్ప. అప్పటికే పక్షుల అరుపులు పూర్తిగా దూరమైనాయి.

"అబ్బ, భలే యిగితి మామా నీది," మెచ్చు కోలుగా అని అజ్జప్పా ఏట్లో దిగాడు.

ఆ ఏట్లో నీళ్లు లేవు... నీళ్లుంటాయనుకొని వచ్చిన వాళ్లకు నిరాశే ఎదురయింది. నిరుత్సాహంగా ఏటిగట్టు పైకొచ్చి మళ్లీ ముందుకు నడక మొదలెట్టారు.

అక్కడ దారులు ఏ పొదచాటు నుంచో, ఏ చెట్టు పక్క నుంచో హఠాత్తుగా ఆరంభమై ఎంతకూ అంతు బట్టని బైరాగితత్వంలా కొంత దూరం సాగి మళ్లీ హఠాత్తుగా అంతమై పోతున్నాయి. అలాంటి దార్లంట వడివడిగా నడుస్తున్నారిద్దరూ. చెట్లల్లో నుంచీ వీస్తున్న కమ్మటి గాలికి వారి శరీరాలు అలుపార్చుకుంటు న్నాయి.

అక్కడొక చోట పల్లెల నుంచి కట్టెల కోసం జనం వచ్చిపోయే దారి తగిలింది. అక్కడాగి అటు ఇటు చూశాడు అజ్జప్ప.

"ఏమైందిరా నా కొండె. యాడ నిలబడితివి?" అని అడిగాడు నాగప్ప.

"ఏంలేదు మామా. ఆ ఒంటిమామిడి చెట్టుకాడ నీ అనుభవం చెప్తివి. యిక్కడ నాకో అనుభవం గుర్తు కొస్తా వుండాది మామా," గట్టిగా శ్వాస పీల్చుకుని వదులుతూ అన్నాడు అజ్జప్ప.

"ఏందో అది."

"ఓ పదయిదేండ్ల మాట. అప్పటికి నాకు కొత్తగా పెండ్లయిండె. ఆ ఎలుగొగ్డోని బాయి దెగ్గిర మన గుడారాలుండె. నా పెండ్లాం సుంకి మంచి ప్రాయంలో వుండె. గేరిలో మొగోళ్లంతా అడివిలోకి యెలబారితే, ఆడోళ్లందరూ పల్లెల మింద బొయిరి. నా పెండ్లామూ కొన్ని సిలకం సీసాలు, పూసలదండలు, పిన్నీసులు ఎత్తుకోని ఆ పక్కనుండే బాలిరెడ్డిగారిపల్లె పక్కకు యెలబారె. అది నడుచుకుంటూ సరిగ్గా ఈడికొచ్చింది. యెట్టనో మన ఏవుడీ తెలుసుకున్న ఫారెస్టోళ్లు మనల్ను తారాడతా వాళ్లూ యీడికే వచ్చినారు."

"ఫారెస్టోళ్ల కండ్లబడితే యింకేమన్నా వుండాదా... అప్పుడేమైందీ," ఆత్రుతగా అడిగాడు నాగప్ప.

"మన భాషలో 'యింగవ' అంటే ఆడోళ్ల వంటికి సంబంధించిన చెడ్డమాట గదా. ఆ మాటెట్లో వాళ్లల్లో ఒకనికి తెలిసున్నింది. పాపగా గుర్తుపట్టి, 'ఓ పాపా... ఇంగవిస్తావా,' అని అడిగినాడంట."

"వోన్ని ఊరికే వదిలిందా యమ్మి," అతడి మాట కడ్డొస్తూ కోపంగా అన్నాడు నాగప్ప.

"ఊరికే యెట్టా వదల్తాది. తప్పు చేసినట్టు అను మానపడిన ఆడదాన్ని పొయ్యి మీద కాలేకాలే పెనం నుంచి వట్టి చేతుల్తో నిప్పట్లు ఎత్తించే కొలంలో పుట్టిన సుంకి ఊరికే వుండునా. మొగం బింగిలించుకొని, మీయక్కాకీ లేదు మీయమ్మాకీ లేదూ యింగవ్?" అనిందంట.

"దాంతో వాళ్లు సుంకితో రంపుకు దిగినారంట. అప్పుడు సుంకి, 'ఓ మేరా మురాద్ ఆవో... ఆ వోరీ,' అంటూ గెట్టిగా అరసబట్టింది. దాంతో నేనూ, మన గేరిలో వోళ్లు ఏం జరిగిందోననుకుంటా పరిగెత్తిపోతిమి. అక్కడ మాకూ, వోళ్లకు సిన్నపాటి దొమ్మీ జరిగింద నుకో," ఆ పరిసరాల్ని పరీక్షగా చూస్తూ చెప్పాడు అజ్జప్ప.

"ఆ ఫారెస్టోళ్ల బాధలు ఇన్నీ అన్నీగాదు. ఇప్పటికీ మన దెగ్గిర మామూళ్లు వసూలు చేస్తుండారు. కాదంటే గుడారాలు పీకేస్తారు. ఇక్కడికి రాకముందు సదుంకాడ నడిగడ్డకవతలుండే అడివిలో దూరుగుండ్ల దెగ్గిరుం టిమి గదా. అక్కడా యిట్లే వచ్చి మామూళ్లు అడిగిరి. మనకు పైసా దొరికేదే గగనంగా వుండాది. యింక ఆళ్లకు అడిగినంత యాడ తెచ్చిస్తాము. యియ్యలే. దాంతో ఆడి నుంచి తరిమేసిరి. ఆ తర్వాత బూరగ మంద అడవిలో కొన్ని రోజులుంటిమి.

"ఆడా ఫారెస్టోళ్ల బాధలు తప్పలే. వాళ్ల పొర్రికి తట్టుకోలేకనే గదా ఆన్నించీ ఈ కల్లూరడివికొస్తిమి. ఈడేమొ నీళ్ల ఆదరువు లేకపాయ."

"అదిసరే మామా... ఆ ఫారెస్టోళ్లు యీడికీ వస్తే ఏంజేయాల."

"అదేరా నేను దిగులు పడతా వుండేది... పైగా నా దెగ్గిర తుపాకీ వుండాది. దీన్ని వాళ్ల కండ్ల పడకుండా కాపాడుకోడం శ్యానా కష్టంగా వుండాది. ముందు కాలం లో అంటే ఎవరూ పట్టించుకోలే. ఇప్పుడు అన్నిటికీ లైసెన్సులు, రూళ్లు."

"అవును మామా నిజమే. తుపాకీని జూసినా ఆ నా కొడుకుల్తో బాధే. వొంటిగా మన ఆడోళ్లను జూసినా బాధే. మామూళ్లు యియ్యకున్నే కష్టమే."

మాట్లాడుకుంటూ మరికొంత దూరం నడిచారు.

అక్కడ... కొంత దూరంలో ఓ చెట్టు పైన కూర్చొని రెండు నల్లటి కృష్ణ పిచ్చుకలు అదే పనిగా అరుస్తున్నాయి. మరో పొద మీద కూర్చొని పసుపు రంగుతో మెరిసిపోతున్న బంగారు పిచ్చుక ఒకటి ఆ పక్షుల్తో జత కలుపుతోంది.

అడవిలో ఏ పక్షి ఎలా అరుస్తుందో, ఎప్పుడు ఎందుకు అరుస్తుందో వాళ్లకు బాగా తెలుసు.

"మామా... ఈ పక్కనేదో దాక్కొనుండాది. ఆ గువ్వలు అందుకే అరస్తా వుండాయి సూడు," వాటినే గమనిస్తూ అన్నాడు అజ్జప్ప.

"నిజమేరో," అని ఆ ప్రాంతంలో వున్న చెట్టు చెట్టునూ, పొదపొదనూ గమనించి ఎందుకైనా మంచి దనుకొని గబగబా వెళ్లి తన తుపాకీని పక్కనే వున్న ఒక తీంఢ్రపొదలోకి దూర్చాడు నాగప్ప.

"ఎందుకు మామా తుపాకీ ఆడ బెడితివి?" కాస్త ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు అజ్జప్ప.

"ఫారెస్టోళ్లేమైనా వుండారేమోనని..."

"అదీ నిజమేలే. నువ్వీన్నే వుండు. నేను చూసొస్తా," తలూపుతూ అని యింకొంచెం ముందుకు వెళ్లి చూశాడు అజ్జప్ప. అతడి దృష్టి ఒకచోట ఆగిపో యింది.

ఎదురుగా వున్న ఒక గుంటి పైన కళ్లు మిట కరిస్తూ కూర్చొనుంది ఒక పెద్ద గుడ్లగూబ.

పడమటి నుంచి వస్తున్న గాలికి దాని వంటి మీది బొచ్చు గాలిలో పైకి లేస్తూ కదుల్తోంది.

గబగబ మళ్లీ వెనక్కొచ్చి, "మామా... ఆ గుంటి మింద గూబ కూసొనుంది. ఆ రంగు పిచ్చికిలు అందుకే అరస్తా వుండాయి," చెప్పాడు అజ్జప్ప.

దాచిన తుపాకీని మళ్లీ చేతుల్లోకి తీసుకుని వచ్చి గుడ్లగూబను చూశాడు నాగప్ప. అది ఈ ప్రపంచంతో తనకేమీ సంబంధం లేనట్టు ఒంటరిగా కూర్చొనుంది.

"అరే, పొగులు గుడ్లగూబకు కండ్లు కనిపించవు. ఏ చెట్టు తొర్రల్లోనో, ఏ గుంటి కింద చీకట్లోనో దాక్కొ నుండి రేత్తిర్లో లోక సంచారం చేస్తుంది. మిణుగురు పురుగుల్ని ఇష్టంగా మింగుతుంది. ఒక్కోసారి వాటి నెక్కువగా మింగి అరాచయించుకోలేక పురుగుల్ని పురుగుల్నే కక్కేస్తుంది. అప్పుడు గనక మనుషులు చూస్తే నిప్పుల్ని కక్కినట్టు అనిపించి జడుసుకుంటారు. రేత్తిర్లో శ్యానా పచ్చులకి కండ్లు కనిపించవు. కనుకే ఈ గూబ కాకుల గూళ్లల్లో జొరబడి వాటి గుడ్లను అప్పనం గా మింగేస్తా ఉంటుంది. అందుకే కాకులకు గూబ లంటే కోపం. పొగులు గూబ కనిపించిందో పొడిసి సంపేస్తాయి. పిచ్చికలు మాత్రం దీన్ని చూసి అరస్తా ఉండాయి."

ఆలోచిస్తూ అజ్జప్ప చేతిలోని దుడ్డుకర్రను తన చేతుల్లోకి తీసుకున్నాడు నాగప్ప.

"వొరే అజ్జా, నువ్వు యిక్కడే నిలబడి చేతులు తిప్పతా డ్యాన్సు యాస్తా వుండు. దానికి సరిగా చూపా నదు. నిన్ను చూస్తా ఉంటాది," అని రహస్యం చెబు తున్నట్లుగా అతని చెవిలో గొణిగి శబ్దం చేయకుండా గుంటి వెనకవైపుకు నడిచాడు నాగప్ప.

అజ్జప్ప గాల్లో చేతులు తిప్పుతూ నర్తించడం మొదలెట్టాడు. గూబ గుడ్లు పెద్దవిచేసి తల తిప్పితిప్పి చూస్తోంది. గుంటి వెనక్కి వెళ్లిన నాగప్ప దుడ్డుకర్రను గాల్లోకి విసిరాడు. అంతే, ఒకటే దెబ్బ. గూబ శబ్దం కూడా చేయలేదు. కిసక్కన కింద పడిపోయింది. అజ్జప్ప గబగబ వెళ్లి దాని కాళ్లు పట్టుకొని చేతుల్లోకి తీసు కున్నాడు. అది కొంతసేపు అలా ఇలా గింజుకొని తుదిశ్వాస వదిలేసింది.

"ఈరోజు పులుసుకి భయంలేదు పో," అని దాని వైపే చూస్తూ అన్నాడు దగ్గరగా వచ్చిన నాగప్ప.

వాళ్ల నడక మళ్లీ ప్రారంభమైంది. కొద్ది క్షణాల్లోనే ఎలుగ్గొడ్డోని బాయి దగ్గరకు చేరుకున్నారు.

పేరుకు బావేగానీ నిజానికి అది చిన్నమడుగు. వంక సాగినప్పుడు, కొద్దిరోజులు నీళ్లు అందులో నిలవ వుంటాయి.

ఈ పక్క సరిగ్గా పంటలు పండి పదేండ్లయిపో యింది. సరైన వానలే లేవు... ఈ సంవత్సరమూ అంతే. వానలే పడినట్టు లేదు. ఎలుగ్గొడ్డోని బాయి పూర్తిగా ఎండిపోయి వుంది. ఆ మధ్య ఏదో పడినట్టుంది. నేల పచ్చంగా ఉందేగానీ... వంక సాగినట్టు లేదు.

దాన్ని చూసేసరికి గుడారాలు అక్కడికి మార్చా లనుకున్న వాళ్ల ఆశ నిరాశే అయింది. నిరుత్సాహంగా ఇంకా ముందుకు నడిచారు.

*

"ఏమ్మామా, నక్కను కొడదామనుకుంటే యాడా వాటి జాడేలేదే," అన్నాడు అజ్జప్ప.

"ఏ గుండ్ల సందున్నో, పొదల్లోనో దాక్కొనుంటా యిరా. వాటిని బయటికి రప్పించేదానికి ముందు కాలంలో అయితే, గొర్రెపిల్ల నొకదాన్ని ఎత్తకపొయ్యి... అడవిలో ఒకచోట తాడుతో చెట్టుకు కటేసేసి, కాన కుండా కూసొనుంటిమి. ఆ పిల్ల అరుపులకు తోడేలో, నక్కో, ఏదో వొగిటి దాన్నెత్తుక పోయేదానికి వస్తా వుండె.

మనం సమయం జూసి తుపాకీతో కాల్చేస్తా వుంటిమి. ఇప్పుడు ఆ గొర్రెలూ లేవు. గొర్రెపిల్లలూ లేవు... ప్చ్..." అన్నాడు నాగప్ప.

"అయితే మనం నక్కను కొట్టలేమా?"

"నాకైతే నమ్మకం లేదప్పా."

మాట్లాడుకుంటూనే అడవంతా తిరిగి రెండు కుందేళ్లను మాత్రం కొట్టగలిగారు. చెరొక కుందేలును చేతబట్టుకొని వెనుదిరిగి గుడారాల వైపుకు నడిచారు.

*

వాళ్లు గుడారాల దగ్గరికి చేరుకునేటప్పటికి చాలా పొద్దయింది. అప్పటికే పల్లెలకు వెళ్లిన ఆడవాళ్లు వచ్చేసి వంటపనిలో నిమగ్నమై వున్నారు. అడవి పైనబడి పోయిన మగవాళ్లు ఏ గువ్వనో, కుందేలినో దేన్నో ఒక దాన్ని కొట్టుకొచ్చి యిండ్లల్లో యిచ్చారు.

"ఏమిరా యింత పొద్దు పోయినాక వస్తిరి గేరికి."

రెండు రోజుల క్రితం పట్టుకొచ్చిన ముంగిసలా ఉన్న ఎంటవ చర్మం ఆరింతర్వాత, దానిలో గడ్డి తురిమి పొట్టవైపు కుట్లు వేస్తూ కూర్చొని వున్న ముసలప్ప పలకరించాడు.

"వొరే అజ్జా, గూబకు బొచ్చు పీకి, కోసి నాకూ సగమియ్యరా."

ముసలప్పకు సమాధానం చెప్పకనే తన గుడారం వైపు నడిచాడు నాగప్ప.

"ఏంపా. నీ కోసరమే సూస్తా వుండా. రాప్పా రా," అంటూ అప్పటికే తిరుపతి నుంచి వచ్చి వున్న నరసప్ప పలకరించాడు.

మూడేండ్ల తర్వాత కొడుకును చూసి ఆనంద పడిపోతూ, "వుండు. తుపాకీ ఆ పక్కన పొదలో పెట్టే సొస్తా," అంటూ గుడారం వెనక్కి దారితీశాడు నాగప్ప.

"తుపాకీ దాచిపెట్టడం ఎందుకమ్మా?" నరసప్ప తల్లి నడిగాడు.

"యిప్పుడు రూలు మారిందంట నాయనా. తుపాకీ పట్టుకోని తిరక్కూడదంట."

"అది మన కులవృత్తి కదా. రైతులకు మడకా కాడిమాను ఎట్లనో, చెప్పులు కుట్టే వాడికి అరె ఎట్టనో, చేపలు పట్టేవోడికి వల ఎట్టనో మనకు తుపాకీ అట్ల. అది లేకపోతే మనం ఎట్ల యాటాడతాం... ఎట్ల పొట్ట నింపుకుంటాం..."

"యేమో నాయనా. పట్టుకుంటే జైలుకేస్తా రంట."

"ఎంతసేపయిందిరాబ్బా వచ్చి," తుపాకీ దాచి పెట్టి, కుందేలిని అలాగే చేతిలో పట్టుకొని గుడారంలో కొస్తూ పలకరించాడు.

అతని చేతిలోని కుందేలు భయంతో వణుకు తోంది. దాన్ని చూస్తూ, "శ్యానా సేపయిందప్పా," అన్నాడు నరసప్ప.

"నీ భారీయ రాలేదా?"

"అది చిన్న బిడ్డతల్లి. రాలా."

"నీకు బిడ్డ పుట్టిన సంగతి కూడా తెలీదే."

"నేను శ్యానా ప్రయత్నం సేసినాప్పా మీకు జెప్తా మని. కానీ ఎక్కడ ఏ అడివిలో వున్నారో తెలీలా."

"అమ్మి బాగుందా?" కోడలి గురించి అడిగాడు. కొడుకు నెగాదిగా చూస్తూ.

"ఆఁ... బాగనే వుంది."

కోర మీసం, నెత్తిన కొప్పు, చెవిలో కమ్మ, ఎర్ర రంగు చొక్కా, మోకాళ్ల కిందిదాకా వదలి కట్టిన బిళ్ల గోచీతో... కాస్త నాజూగ్గానే కనిపిస్తున్నాడు నరసప్ప.

"ఏమయ్యా మనవడంట. అంతా నీ పోలికే నంట. అప్పొడు సెప్పినాడు," ఆనందంగా చెప్పింది నాగప్ప భార్య.

"మీరు ఏరోజు ఏతావనుంటారో తెలీదు. అందు వల్ల నేను రాలేను. మీరన్నా నా దెగ్గరికి రావచ్చు గదా," నిష్ఠూరంగా అన్నాడు నరసప్ప.

"అందరూ ఆడికొస్తే తిండికెట్లరా."

"ఏమప్పా, కన్నోళ్లకు తిండి పెట్టలేనా?"

"సరే... నీ యాపారమెట్టుండాది?" ఓ మూల సంచిలో ఉన్న చురకత్తిని వెదికి తీసుకుంటూ అడిగాడు.

"నా బామర్దితో బాటుగా తిరపతి బజార్లో దారా లేపారం బెడితి. ఏమీ జరగలా... శ్యానా కష్టంగా వుండె. అట్టగాదని యింకొంత సరుకు కొని కొండపైన పాప నాశనం కాడికి పొయ్యి యాపారం బెడితి... పోయిన కొత్తలో మనకు తగినోళ్లు ఎవ్వరో వొగరొచ్చి పూసల దండలు, నల్లదారాలు, గవ్వలు కొనక్కపోతా వుండ్రి. కానీ ఇప్పుడు నాగరీకం ముదిరిపోయిండాది. మన సరుకులు ఎవురూ తీసుకోడంలే. పెద్దపెద్ద యాపారాలు చేసేకి మన దెగ్గర దుడ్డు లేకపాయే. ఏదో జరగతా వుండాది," తన పరిస్థితిని వివరించాడు నరసప్ప.

"యాడబోయినా మన బతుకులింతే," అను కుంటూ, "అమ్మీ, అప్పొడొచ్చినాడు గదా. కుందేల్ని కోసిస్తా. బాగా మసాలా బెట్టి వండు. తినిపోతాడు," అని చెప్పి మళ్లీ గుడారం వెనక్కి నడిచాడు.

*

ఆ మరునాడు... అన్ని సద్దినీళ్లు దాగి గేరిలో మనుషులంతా చేరి మాట్లాడుకుంటున్నారు. ఆ సంభాషణంతా వాళ్ల భాషలోనే సాగుతోంది.

"ఈ ఊట్లోనొంక ఆరిపాయ. రెండు దినాలుగా చెలమలు దీసి నీళ్లు తీసకొస్తా వుండాము... యిట్లే వుంటె యెట్లా..." అన్నాడు ముసలప్ప.

"అజ్జప్పా నేనూ ఎలుగ్గొడ్డోని బాయి, మల్లబ్బాయి, ఎఱ్ఱజాళ్లు, బోడగుట్ట అన్నీ తిరిగేసొస్తిమి. యాడా శారెడు నీళ్లు లేవు," చెప్పాడు నాగప్ప.

"యాడబోయినా కరువే... ఇంక నీళ్లేడ దొరకతాయి?"

"ఈ అగసాట్లు పడేకంటే మనమూ నరసప్ప మాదిరి టవున్లో చేరిపోతే పోలా."

"టవున్లో మాత్రం మనం చేసే పనులేముండాయి?"

"పూసలూ, దారాలూ అమ్ముకొని బతకొచ్చు గదా."

"టవున్లో పరిస్థితి కూడా బాగలే. మన వస్తువులు ఎవరూ కొనడంలా," తన అనుభవాన్ని చెప్పాడు నరసప్ప.

అందరిలోనూ రేపెట్లా అన్న ఆలోచనే.

రేపటిరోజు కోసం దిగులే.

"వొరే నర్సింగా... మేమూ టవున్లోకొచ్చేస్తాం... మాకూ అంత చోటు చూపించరా," ఓ చింపిరి జుట్టు ప్రశ్నించింది.

"ఆడ నేనే కన్న అగసాట్లు బడతాండా. యింక మిమ్మల్నేడ బెట్టేది?" అన్నాడు నరసప్ప.

ఇంతలో... "పట్టుకోండ్రా కొడుకుల్ని... కొట్టండ్రా కొడుకుల్ని," వాళ్ల సంభాషణ కంతరాయం కలిగిస్తూ హఠాత్తుగా అరుపులు వినిపించాయి.

'ఏమిటబ్బా,' అనుకుంటూ అందరూ అటు వైపుకు చూశారు. అడవిలో నుంచి కట్టెలమోపు లెత్తుకొస్తున్న పల్లెల వాళ్లని అటకాయిస్తున్నారు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వాళ్లు. కట్టెల మోపుల్ని దింపించేసి, వాళ్ల చేతుల్లో వున్న మచ్చుకత్తుల్ని స్వాధీనం చేసుకొంటున్నారు.

"ఇట్లా అందరూ జేరి అడవి మిందబడి చెట్లు కొట్టేస్తామంటే... అడివెట్ల బాగుపడుతుందయ్యా?"

కట్టెలవాళ్లను అరుస్తున్నాడు ఒక వాచర్.

"అద్దో ఆ పక్కపొండి. గుడారాలు పీకండి."

ఫారెస్ట్ గార్డు వాచర్లను పురమాయిస్తున్నాడు.

ఆ మాటలు విన్న గేరి జనానికి ఏం చేయాలో పాలుపోలేదు. ఆలోచించుకునే లోపలే బండబూతులు తిడుతూ వాచర్లు డేరాలను పీకేయడం మొదలెట్టారు.

క్షణంలో అక్కడ జరిగిపోతున్న బీభత్సానికి బెంబేలుపడిపోయారు నక్కలోళ్లు.

"అయ్యో, ఆగండయ్యా. ఆగండి సామే," దీనంగా బతిమిలాడుకుంటున్నారు.

"మీ వల్లే అడివిలో జంతువులు నశించిపోతా వుండాయి... పోండయ్యా పోండి."

"ఇంక అడవుల్లో డేరాలేసినారంటే జైల్లోతోస్తాం."

"తుపాకులుంటే ఇచ్చేయండి. దొరికినాయో కేసులు బెట్టి బొక్కలో తోయించేస్తాం."

"మీవల్లే నక్కలు, తోడేళ్లు, కుందేళ్లు అయిపు లేకుండా అయిపోతున్నాయని మా ఆఫీసర్లు మమ్ముల తిడతా వుండారు."

"ఇంక గనక అడవుల్లో కనిపించినారా... నక్కలైట్లని జెప్పి కాల్చిపారేస్తాం అంతే."

ఫారెస్టోళ్ల బెదిరింపులు విని నిలువెల్లా నీరుగారి పోయారు గేరిజనం. పిల్లలు భయపడిపోయి ఏడుపు లంకించుకున్నారు. ఆడవాళ్లు శోకాలు పెడుతూ గుండెలు బాదుకోవడం మొదలెట్టారు.

హఠాత్తుగా పొంగి జనావాసాలను ముంచేసి పోయిన తుపానులా గుడారాలను పీకి సామాన్లు చిందరవందర చేసి చక్కగా వెళ్లిపోయారు ఫారెస్టోళ్లు.

అల్లకల్లోలంగా మారిపోయిన ఆ ప్రాంతంలో ఆడవాళ్లు సామాన్లని ఏరి సర్దుకోసాగారు. మగవాళ్లు గుడారాలను కట్టలు కట్టారు. సామాన్ల సంచుల్ని భుజాలనేసుకుని, గుడారాల కట్టల్ని నెత్తిన పెట్టుకుని పిల్లాజల్లల్తో గేరి బయలుదేరింది.

ముందు నరసప్ప, అతని వెనుక నాగప్ప, వాళ్ల వెనుక గేరి జనం.

'అడవిలో జంతువులు నాశనమైపోతున్నాయని తరిమేస్తున్నారేగానీ, అడవుల పైనబడి బతికే మా బతుకులు ఏమైపోతాయోనన్న యోచన ఒగ్గనికీ లే. జంతువుల కంటే కనాకష్టమైపోయిండాది మా బతుకులు.'

తీవ్రంగా ఆలోచిస్తూ నడుస్తున్నాడు నాగప్ప.

గమ్యం తెలీని గేరి జనం నడక అతని వెంట ముందుకు సాగిపోతూనే వుంది.

*విపుల మాసపత్రిక , ఫిబ్రవరి 2007*